నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, గురువారం 29 మే 2025 | NALGONDA



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట ఎస్పీ నర్సింహా



## నీటి వాటా సాధించడంలో కాంగ్రెస్, బీజేపీ విఫలం

### నరసింహారెడ్డి

హుజూర్‌నగర్, మే 28: తెలంగాణకు రావాల్సిన నీటి వాటా సాధించడంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీకి చెందిన పార్టీలు అని .. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏ పని చేయాలన్నా ఢిల్లీ నుంచి ఆదేశాలు రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లితే కనీసం ఆ పార్టీ అధిష్టానం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని దుస్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు. సీఎం బీజేపీతో జతకట్టడంతో పాటు ఇటీవల హెరాల్డ్ మనీ లాండరింగ్ చార్జ్ షీట్లో రేవంత్‌రెడ్డి పేరు ఉండటంతో ఆ కేసు నుంచి తప్పించుకోవాలని బీజేపీతో దోస్తీ చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర కాలమైనా పూర్తి స్థాయిలో మంత్రివర్గాన్ని విస్తరించకపోవడంతో కాంగ్రెస్ పార్టీ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కృష్ణా జలాల దోపిడీపై మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కనీసం నీటిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, అవగాహన ఉంటే జలదోపిడీపై స్పందించి పోరాటం చేయాలన్నారు. ప్రజల చూపు కేసీఆర్ వైపు ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ కేఎల్ఎన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు సైదిరెడ్డి, జగన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పాలకీడు మండలపార్టీ అధ్యక్షుడు అంజిరెడ్డి, నగేష్ రాథోడ్, రాంబాబు, చంద్రమౌళి పాల్గొన్నారు.

## శిశు విక్రయ ముఠా గుట్టురట్టు

### 13 మంది ముఠా సభ్యుల అరెస్ట్

- 10 మంది చిన్నారులను గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చిన్నారులను నల్లగొండ బాలల సంక్షేమ కేంద్రానికి అప్పగింత
- చిన్నారుల కోసం పోలీస్ స్టేషన్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన
- అహ్మదాబాద్, ముంబైల నుంచి చిన్నారుల కొనుగోలు
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ

సూర్యాపేట, మే 28 : ఇతర రాష్ట్రాల నుంచి శిశువులను కొనుగోలు చేసిన పిల్లలు లేని తల్లిదండ్రులకు విక్రయిస్తున్న ముఠా గుట్టును సూర్యాపేట పోలీస్‌లు రట్టు చేశారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ నరసింహ కేసు వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో శిశువులను కొనుగోలు చేసి దత్తత తీసుకుంటున్నట్లు సమాచారంతో సూర్యాపేట డీఎస్పీ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ, సూర్యాపేట రూరల్ సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అంజయ్య, నాగయ్యలను అరెస్ట్ చేసి విచారణ చేయగా ముఠా అక్రమాల విక్రయాలు బయటపడ్డాయి. వారు ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా కేంద్రానికి చెందిన నక్క యాదగిరి, ఉమారాణిలను అరెస్ట్ చేసి పోలీసులు విచారించారు. 13 మందితో కూడిన ముఠా సభ్యుల దందా బయటపడింది. అహ్మదాబాద్, ముంబైల నుంచి శిశువులను రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు కొనుగోలు చేసి పిల్లలు లేనివారికి కమీషన్ల రూపంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. సూర్యాపేటకు చెందిన యాదగిరి, ఉమారాణి ఆటోలో తిరుగుతూ కోడిగుడ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారు తిరుగుతున్న గ్రామాల్లో పిల్లలులేని వారిని గుర్తించి వారికి పిల్లలు తెచ్చి ఇస్తామని తమకు కమీషన్ ఇస్తే చాలని చెప్పి విక్రయాలకు పాల్పడుతున్నారు. వీరికి విజయవాడకు చెందిన కోరే నాగేందర్‌కుమార్, దిల్‌సుఖ్‌నగర్‌కు సబావత్ శ్రీనివాస్‌ల మధ్యవర్తిత్వం ద్వారా శిశువులను దత్తత ఇచ్చారు. వీరితో పాటు విజయవాడకు చెందిన కొట్టే రమాలక్ష్మి, పావని, విజయలక్ష్మి, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రాజు, హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రాంతానికి చెందిన ఐతా శోభారాణి, రాజస్తాన్‌కు చెందిన ఖాన్ షాహీనా, హైదరాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన ఎండీ సహానా, హైటెక్ సిటీకి చెందిన ఈర్పుల సునీతలు సభ్యులుగా ఉంటూ శిశువిక్రయాలకు పాల్పడుతున్నారు. వీరందరినీ సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో అరెస్ట్ చేశారు. ఇప్పటి వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు హైదరాబాద్ ప్రాంతంలో 10 మంది శిశువులను విక్రయించారని అందులో ఏడుగురు మగ శిశువులు, ముగ్గురు ఆడ శిశువులు ఉన్నారన్నారు. సూర్యాపేట మండలం టేకుమట్లలో ఇద్దరు బాలురు, సూర్యాపేట పట్టణంలో ఇద్దరు బాలికలు, పెన్‌పహాడ్‌లో ఒక బాలుడిని, ఉప్పలపహాడ్‌లో ఇద్దరు బాలురు, నల్లగొండ జిల్లా చిన్న సూరారంలో ఒక బాలిక, హైదరాబాద్‌లో ఒక బాలికను అమ్మినట్లు తెలుపడంతో వారందరినీ పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. వారిని నల్లగొండలోని బాలల సంక్షేమ కేంద్రానికి తరలించామన్నారు. వారి నుంచి సెల్‌ఫోన్‌లు, రెండు కార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని సూర్యాపేట కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీసీఎస్ సీఐ శివకుమార్, సూర్యాపేట రూరల్‌సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలూనాయక్, ఐసీడీఎస్‌పీడీ నరసింహారావు పాల్గొన్నారు.

**తల్లిదండ్రుల ఆందోళన**

దత్తత తీసుకున్న తల్లిదండ్రులు చిన్నారుల కోసం ఆందోళన చేపట్టారు. తమ పిల్లలను నల్లగొండ పంపించకుండా తమకు ఇవ్వాలని పెద్దఎత్తున రోదించారు. తమ ఆస్తులన్నీ పిల్లల పేరు మీద రాస్తాం.. తమకు పిల్లలను అప్పగించండి అంటూ కనిపించిన పోలీసులను తల్లిదండ్రులు వేడుకున్నారు.







బొల్లంపల్లి గ్రామంలో కాంటా వేసిన ధాన్యం బస్తాల్లో మొలకలు వచ్చిన దృశ్యం, ధాన్యం కాంటా వేయాలని పురుగులమందు డబ్బా, మొలకెత్తిన ధాన్యంతో మహిళా రైతు నిరసన

## మొలకెత్తిన ధాన్యం రోడ్డెక్కిన రైతన్న

అర్వపల్లి మే 28 : నెలలు గడుస్తున్నా ధాన్యాన్ని కాంటా వేయడం లేదంటూ, అకాల వర్షాలతో ధాన్యం మొలకెత్తుతున్నదంటూ, రైతులు మొలకెత్తిన ధాన్యం బస్తాలతో NH 365 జాతీయ రహదారి పై ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో నెలరోజులు దాటినా కాంటా వేయలేదు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్‌లో ఎంట్రీ చేయకపోవడంతో అకౌంట్లో డబ్బులు జమ కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు చావే శరణ్యమంటూ చింతల సైదమ్మ అనే మహిళా రైతు పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగింది. అలాగే ఒక బస్తాకు మూడు కిలోల తరుగు తీస్తున్నారని తెలిపారు. ఈ కేంద్రంలో ఇంకా 4 లారీలకు సరిపడా ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసి ముద్దయింది. బస్తాల నుండి ధాన్యం మొలకలు ఎత్తి బయటకొస్తున్నాయి. అధికారులకు ఫోన్ చేస్తే సరైన సమాధానం చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు. దాదాపు రెండు గంటల పాటు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించడంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో రైతులు కాటబత్తిని లక్ష్మీనర్సు, గోసుల విజయ్ కుమార్, సంద్ర యాదయ్య, లింగయ్య, అంకిరెడ్డి రాజారాములు, యాదగిరి, శాగంటి నాగరాజు, ఉప్పలయ్య, వీరాంజనేయులు, అంతయ్య, అయోధ్య, మల్లేష్, అంజయ్య, సులోచన, నర్సయ్య, యాదగిరి, పాల్గొన్నారు

### పురుగుల మందు డబ్బాతో నిరసన

> “ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెలలు గడుస్తున్నా కాంటా వేయడంలేదు. అకాల వర్షంతో ధాన్యం మొలకెత్తుతున్నది. బస్తాల నుంచి మొలకలు బయటకు వస్తున్నాయి. కాంటా వేసినా.. కిలోల కొద్దీ ధాన్యాన్ని తరుగు తీస్తున్నారు. కొనుగోలు వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ చేయకపోవడంతో అకౌంట్లల్లో డబ్బులు పడుతలేవు. తడిసి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి.. లేదంటే తమకు చావే శరణ్యం.
>
> \- చింతల సైదమ్మ



## అకాల వర్షం.. ఆగమాగం

తుంగతుర్తి, మే 28: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గానుగబండ గ్రామంలో ఏర్పాటుచేసిన ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతుల ధాన్యం వర్షానికి తడిసి మొలకలు వచ్చాయి. వరదకు ధాన్యం కొట్టుకుపోయి నీటి పాలైన ఘటన చోటు చేసుకున్నది. దీంతో రైతులు లబోదిబోమంటూ గుండెలు బాదుకుని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంపటి గ్రామానికి చెందిన మహిళా రైతు వెలిశాల ఉపేంద్ర మాట్లాడుతూ ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా కాంటా వేయకుండా ధాన్యం నీటి పాలు అయ్యే విధంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ధాన్యాన్ని కాంటా పెట్టాలని ఎవరితో చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితిలో యావత్ రైతాంగం ఉన్నదని ప్రభుత్వం, అధికారులు గానీ కనీసం నిమ్మకు నీరెత్తే విధంగా ఉన్నారని, అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎలాంటి తరుగు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని త్వరగా కాంటా వేయాలని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని లేకపోతే తమకు చావే శరణ్యమని తెలిపారు.



## బాలుడిని చితకబాదిన కానిస్టేబుల్

ఆత్మకూరు(ఎం), మే 28 : దాహం తీర్చుకునేందుకు బోరు నీళ్లు తాగినందుకు మైనర్ బాలుడిని కానిస్టేబుల్ చితకబాదిన ఘటన, ఆత్మకూరు (ఎం), లో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది, వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మజ్జిగ ప్రవీణ్ ఈ నెల 26 న ప్రవీణ్ తల్లి విజయ తన వ్యవసాయ బావి వద్ద గొర్రెలను మేపుతుండగా భోజనం తీసుకుని వెళ్ళాడు. వీరి వ్యవసాయ బావి పక్కనే ఉన్న 18 ఎకరాల వ్యవసాయ భూమిని ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న లింగంనాయక్ కౌలుకు చేస్తున్నాడు.దీనితో ప్రవీణ్ కు దాహం వేయడంతో కానిస్టేబుల్ కౌలు కు చేస్తున్న భూమికి చెందిన బోరు మోటర్ ఆన్‌చేసి దాహం తీర్చుకునేందుకు ప్లాస్టిక్ బాటిల్ లో నీళ్లు పట్టుకున్నాడు.అక్కడే మేత మేస్తున్న గొర్రెలు కూడా నీళ్లు తాగేందుకు బీడు పొలం లోకి వచ్చాయి. దీనితో ఆగ్రహించిన కానిస్టేబుల్ లింగం నాయక్ బోర్ ఆన్ చేసి తాగేందుకు నీళ్లు పట్టుకుంటావా అంటూ మైనర్ బాలుడైన ప్రవీణ్ పై దాడి చేసి,కర్రతో కొట్టినట్లు బాధితుడు ప్రవీణ్ తో పాటు అతని తల్లి విజయ తెలిపారు.దాడి జరిగిన రోజే పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ లింగం నాయక్ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.బుధవారం విలేకరుల సమావేశంలో కుర్మ సంఘం నాయకులు మాట్లాడుతూ మైనర్ బాలుడిని అకారణంగా చితకబాది, దాడిచేసిన కానిస్టేబుల్ లింగం నాయక్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎంజీయూ డిగ్రీ పరీక్షల ఫలితాలు విడుదల

రామగిరి, మే 28: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఇయర్‌వైజ్ (మూడేండ్ల) డిగ్రీ బ్యాక్‌లాగ్ మార్చి/ఏప్రిల్-2025లో నిర్వహించిన పరీక్షల ఫలితాలను గురువారం పరీక్షల భాగంలో సీవోఈ డా.ఉపేందర్‌రెడ్డి విడుదల చేశారు. ప్రథమ ఏడాదిలో 581మంది విద్యార్థులు హాజరు కాగా, 166 మంది ఉత్తీర్ణత సాధించడంతో 28.57శాతం ఫలితాలు వచ్చాయి. ద్వితీయ ఏడాదిలో 862 మంది హాజరు కాగా 198 మంది ఉత్తీర్ణత సాధించగా 22.96 శాతం ఫలితాలు వచ్చాయి. తృతీయ ఏడాదిలో 2065 మంది హాజరు కాగా 583 మంది ఉత్తీర్ణత సాధించగా 28.23 శాతం ఫలితాలు వచ్చాయి. ఫలితాలను www.mguniversity.ac.inలో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.


## సంప్రదాయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చిట్యాల, మే 28 : వానకాలం పంట వరినాట్లు వేసేలోపు రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన చిట్యాలలో రూ. 1.50 కోట్లతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్‌ను రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగంలో ఒడిదుడుకులను ఎదుర్కొని నిలదొక్కుకున్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. అకాల వర్షాలు, అనుకోని ఘటనలు జరిగినప్పుడు తట్టుకొని నిలబడే విధంగా రైతు పంటలు వేసుకోవాలన్నారు. ఆయిల్ పామ్, సంప్రదాయ పంటల వైపు మొగ్గు చూపాలని అన్నారు. రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా, రైతుబీమా, విద్యుత్, ఎరువులు, విత్తనాల వంటివి సకాలంలో రైతుకు అందజేసినప్పుడు రైతు సరైన విధంగా పంటలు పండించగలుగుతాడని అన్నారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామానికీ ప్రజాపాలన అందించే దిశగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, మంత్రుల ప్రత్యేక పర్యవేక్షణలో పరిపాలన కొనసాగుతున్నదని తెలిపారు. రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్రా వినోదామోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా ఐతరాజు యాదయ్య, బూరుగు కృష్ణయ్య, గజ్జెల భాస్కర్‌తోపాటు 14 మందిని సభ్యులుగా జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి ప్రమాణ స్వీకారం చేయించారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మల్లేశ్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిట్యాలలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



మహిళకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

## సంక్షేమ సారథి కేసీఆర్

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 28 (నమస్తే తెలంగాణ): సంక్షేమ పాలనలో దేశంలోనే కేసీఆర్‌ను మించిన సీఎం మరెవరూ లేరని గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆయన అమలు చేసిన పథకాలు ప్రపంచంలోనే మరెక్కడా లేవని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గతంలో ఒకరిద్దరికి మాత్రమే పరిమితమైన సీఎంఆర్ఎఫ్ లాంటి స్కీంను కూడా అందరికీ వర్తింపజేసింది కేసీఆరే అని గుర్తు చేశారు. బుధవారం సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రపంచంలోనే మరెక్కాడా లేవని, ప్రజలు అడిగినవే కాకుండా అవసరమనుకున్న అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నప్పటికీ కేసీఆర్ పథకాలతో తప్ప ప్రజలకు కొత్తగా ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. మాయ మాటలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ చేతులెత్తేసిందని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఏమైనాయో తెలియదన్నారు. కళ్యాణ లక్ష్మి కింది కేసీఆర్ ఇచ్చిన రూ. లక్ష తప్ప కాంగ్రెస్ ఇస్తామన్న తులం బంగారం ఊసే లేదన్నారు. రైతులకు దిక్కూమొక్కూ లేకుండా పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రైతు భరోసా కాదు నేడు వ్యవసాయానికే భరోసా లేకుండా పోయిందన్నారు. నారుమళ్లలా మారిన కల్లాలను చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.